క్లుప్తంగా

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రకటన

గండేపల్లి: మురారిలో రామలింగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రకటన విడుదల చేసినట్టు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. కమిషనర్, ఉప కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్రకటన వెలువరించామన్నారు. ఈ ప్రకటన అనుసరించి ధర్మకర్తల మండలి నియమాల ప్రకారం 20 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గంజాయి కేసులో నిందితుడి లొంగుబాటు



లొంగిపోయిన నిందితుడిని చూపుతున్న సీఐ, ఎస్సైలు

గండేపల్లి: పరారీలో ఉన్న గంజాయి కేసులో నిందితుడు గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్టు సీఐ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన షేక్ బాజీబాబా, అదే మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన ముక్కాల ప్రకాశరావు ఈ నెల 22న మోటార్ బైక్‌పై మూడు ప్యాకెట్లలో ఆరు కిలోల గంజాయిని తరలించేందుకు యత్నించారు. తమకు అందిన సమాచారంతో గండేపల్లి ఎస్సై ఎన్ రామకృష్ణ తన సిబ్బందితో గండేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, గంజాయి తరలిస్తున్న వీరు కంటపడ్డారు. వీరిలో ప్రకాశరావు పరారు కాగా, గంజాయి ప్యాకెట్లు, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. బాజీబాబాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రకాశరావు సోమవారం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోగా, అరెస్టు చేసి రిమాండ్ కోసం పెద్దాపురం తరలించినట్టు సీఐ తెలిపారు.

క్షతగాత్రునికి సీఐ సపర్యలు



సంఘటన స్థలం వద్ద క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న సీఐ

గండేపల్లి: జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడికి జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు సపర్యలు చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఆయన తన వాహనంలో గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు. మార్గం మధ్యలో బొర్రంపాలెం వద్ద మోటార్ సైక్లిస్ట్ జువ్వల సూరిబాబు తన ముందున్న కారును ఢీకొట్టడంతో గాయపడ్డాడు. దీనిని గమనించిన సీఐ హుటాహుటిన క్షతగాత్రుని వద్దకు చేరుకుని, సపర్యలు చేశారు. అంబులెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుని, క్షతగాత్రుడిని జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని మెకానిక్‌కు తీవ్ర గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మంగళవారం ఇసుక లారీ ఢీకొని మెకానిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు, కలవచర్లకు చెందిన బత్తిన జ్యోతీష్ దుర్గాకుమార్ గండేపల్లిలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకునేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. మెకానిక్ షాపునకు తిరిగొస్తుండగా.. గ్రామంలో పోస్టాఫీసుకు వెళ్లే మార్గం ఎదురుగా డివైడర్‌కు సమీపంలో రోడ్డు దాటుతుండగా, ఇసుక లోడుతో కత్తిపూడి వైపు వెళుతున్న లారీ ఇతడి బైక్‌ను ఢీకొంది. అతడిపి కొంత మేర ఈడ్చుకుపోయింది. ఈ దుర్ఘటనలో కుమార్ ఎడమ చేయి నుజ్జయింది. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఎస్సైగా జబీర్ బాధ్యతల స్వీకరణ



కిర్లంపూడి: కిర్లంపూడి ఎస్సైగా షేక్ జబీర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన పి.ఉమామహేశ్వరరావు కాకినాడ వీఆర్‌కు తరలించారు. కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన షేక్ జబీర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, పటిష్టంగా లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తామని తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

వచ్చే నెల 'పల్లెకు పోదాం'

ఏలేశ్వరం: గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. పార్టీ పట్టణ నూతన అధ్యక్షుడిగా రెడ్డి లోవరాజు, జిల్లా కార్యవర్గ సభ్యునిగా గట్టెం వెంకటరమణకు మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చేనెల తొలివారంలో చేపట్టే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు.

అసంపూర్తి పనులేంటి!?

- బాగున్న రోడ్లు తవ్వేశారు
- కుళాయిలు వేయలేదు
- జల్‌జీవన్ మిషన్ తీరు ఇదేనా?
- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



మండల పరిషత్ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

జగ్గంపేట: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గోతులు తవ్వేసి, కుళాయిలు వేయడం మానేశారని, ఇలాంటి పనుల వల్ల రానున్న ఎన్నికల్లో ప్రజలకు ఏం సమాధానం చెప్పాలంటూ అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. జగ్గంపేట మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జల్‌జీవన్ మిషన్ కాంట్రాక్టర్ల తీరును ప్రజాప్రతినిధులు ఎండగట్టారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా, ఏ పని చేపట్టినా ప్రజల మన్ననలు పొందుతోందని, జల్‌జీవన్ మిషన్ వల్ల ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే పరిస్థితి తలెత్తిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగున్న రోడ్లు ఎక్కడపడితే అక్కడ తవ్వేశారని, కనీసం గోతులు పూడ్చలేదని, కుళాయిలు కూడా వేయలేదని, ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణం జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి అధికారులకు సూచించారు.

కొత్త సచివాలయాల్లో విధులు నిర్వర్తించరా?

మండలంలోని కాట్రావులపల్లిలో రెండు సచివాలయాలు ప్రారంభించినా, అందులో విధులు ఎందుకు నిర్వహించటం లేదని స్థానిక నేతలు పంచాయతీరాజ్ అధికారులను నిలదీశారు. ఎప్పటిలోగా సచివాలయాలు అందుబాటులోకి వస్తాయని ప్రశ్నించారు. ప్రతి మండల సమావేశంలో అనేక గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై చెబుతున్నా, ఎక్కడా పరిష్కారం కావడం లేదని విద్యుత్ అధికారుల తీరు మారటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరును ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి సమీక్షించారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీడీఓ వసంతకుమార్, తహసీల్దార్ శ్రీదేవి, మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నిబంధనల మేరకు అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని ప్రత్తిపాడు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వివిధ పార్టీల రాజకీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా ప్రకటించిన తర్వాత ఇప్పటివరకు కొత్త ఓటరు నమోదు, తొలగింపులు, సవరణల కోసం 40,631 అర్జీలు దాఖలు కాగా, వీటిలో 40,402 అర్జీలు పరిష్కరించి, 229 అర్జీలు పెండింగ్‌లో ఉంచామన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో కొత్త ఓటరు నమోదుకు 13,025 దరఖాస్తులు రాగా, వాటిలో 12,934 దరఖాస్తులను పరిష్కరించి, 91 పెండింగ్‌లో ఉంచామన్నారు. ఓటరు జాబితా నుంచి తొలగింపుల కోసం 11,157 దరఖాస్తులు రాగా, 11,110 పరిష్కరించి, 47 పెండింగ్‌లో ఉంచామన్నారు. సవరణల కోసం 16,449 దరఖాస్తులు రాగా, వాటిలో 16,358 పరిష్కరించి, 91 పెండింగ్‌లో ఉంచామని చెప్పారు. గ్రామాల్లో అర్హత ఉన్న యువతీయువకులను ఓటరు జాబితాలో చేర్చేందుకు బీఎల్వోలకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

ప్రత్తిపాడు రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగారురాజు అన్నారు. మండలంలోని చింతలూరులో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఏనుగుపాటు అర్జునరావు అధ్యక్షత వహించారు. బంగార్రావు మాట్లాడుతూ కేంద్రంలో కొనసాగుతున్న ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. నాయకులు మానుకొండ లచ్చబాబు, సామిరెడ్డి నారాయణమూర్తి, పేరూరు లక్ష్మి, తిపరాల రత్నం, ఎస్ కుమారి, జి.చక్రరావు, నందా వెంకట్రావు, బి సత్తిబాబు, ఎస్ నూకరాజు, తాడి నాగేశ్వరరావు, దేవతయ్య, రాజాలరత్నం పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



వెంకటలక్ష్మి (ఫైల్)

రౌతులపూడి: రౌతులపూడిలో నివసిస్తున్న రొట్ట వెంకటలక్ష్మి(36) అనే మతిస్థిమితం లేని మహిళ ఆదివారం తెల్లవారుజాము నుంచి అదృశ్యమైంది. కాలాకృత్యాల కోసం ఇంటి బయటకు వచ్చిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ప్రయోజనం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94407 96552, 94916 86822 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై అబ్దుల్ నబీ కోరారు.

రోగులకు పాలు, రొట్టెల పంపిణీ

ఏలేశ్వరం: మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మండల వైద్యాధికారి శైలజ చేతుల మీదుగా సోమరాజు తండ్రి చినబుచ్చిరాజు 63వ వర్ధంతి సందర్భంగా రోగులకు వీటిని అందజేశారు. వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ సోమరాజు తన తండ్రి జ్ఞాపకార్థం పేదలకు సేవా కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి దాడిశెట్టి రాజా

పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి దాడిశెట్టి రాజా

తుని: కోటనందూరు మండలం కాకరాపల్లికి చెందిన.. గత ఎన్నికల్లో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి అయిన వాసం చక్రం తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్ అన్నవరంలోని మంత్రి దాడిశెట్టి రాజా క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో వాసం చక్రంతో పాటు మరో 50 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. మంత్రి దాడిశెట్టి రాజా వీరికి వైఎస్సార్ సీపీ కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్టు వారు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కొత్త, పాత నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి, పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి దాడిశెట్టి రాజా వారికి సూచించారు.

కుష్టు వ్యాధి నివారణపై ర్యాలీలు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, సీతంపేట, జి.కొత్తపల్లి గ్రామాల్లో గాంధీజీ వర్ధంతి సందర్భంగా వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి నివారణ అవగాహనపై ర్యాలీలు నిర్వహించారు. మంగళవారం గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీతంపేట రిఫరల్ ఆస్పత్రికి ముఖ్య అతిథిగా స్విట్జర్లాండ్‌కు చెందిన డాక్టర్ మాథ్యూస్ హాజరయ్యారు. రిఫరల్ చైర్మన్ స్లెషర్‌బాబు మాట్లాడుతూ సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహోన్నత వ్యక్తి జాతిపిత గాంధీజీ అని కొనియాడారు. రోగులకు దుప్పట్లు, దుస్తులు అందించారు. డాక్టర్లు సాల్మన్‌రాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'సిద్ధం'ను విజయవంతం చేయాలి



కిర్లంపూడి సమావేశంలో మాట్లాడుతున్న తోట రాంజీ



గోకవరం సమావేశంలో మాట్లాడుతున్న దాసరి చినబాబు

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల మూడున ఏలూరులో నిర్వహించే సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో పార్టీ కార్యకర్తలు, వలంటీర్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. సిద్ధం బహిరంగ సభకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి, విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, తోట అయ్యన్న, సచివాలయ మండల కన్వీనర్ పెనగంటి రాజేష్, అడారి మహేష్, ఓలేటి రాజు, పాముల చంటి, వేగి రామకృష్ణ, కర్రి వెంకటరమణమూర్తి, అడారి గంగబాబు, దాడి చిన్నబుజ్జి పాల్గొన్నారు.

గోకవరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న ఏలూరులో జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దాసరి చినబాబు కోరారు. గోకవరం ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి సిద్ధం సభకు వెళ్లడానికి బస్సులు ఏర్పాటు చేశామని, ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నరాలశెట్టి నర్శయ్య, అంబటి ప్రసన్న, వీర్ల వెంకటేశ్వరరావు, బిజ్జి రాజు, బత్తుల నానాజీ, మచ్చా మోహన్, మచ్చా మురళి, గోళ్ల చిన్ని, మండపాటి సతీష్, రూపం వాడపల్లి తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో ప్రాతినిధ్యం పెంచాలి

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయులు



సమావేశంలో మాట్లాడుతున్న కుసుమంచి సుబ్బరాయులు

తుని: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం పెంచాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు కోరారు. మంగళవారం తుని ఆర్యవైశ్య భవనంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్యవైశ్యులకు రాజకీయ పితామహుడు, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య పేరిట రాష్ట్రంలో స్మృతివనం ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. ఆర్యవైశ్యుల కోసం విజయవాడలో భవనం ఏర్పాటు చేయాలని, ఆర్యవైశ్య పేదలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఆర్యవైశ్యుల ఉన్నతి కోసం పార్టీలకతీతంగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశానికి వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన శ్రీఘాకొళపు శివరామసుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, కొలగొట్ల వీరభద్రస్వామి, బి.చంద్రశేఖర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తుని ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ నాయకులు కుసుమంచి సుబ్బరాయులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్ల రత్నాజీ, నాయకులు పేరూరి కృష్ణ, తటవర్తి రాజా పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన సినీ రచయిత జేకే భారవి



సత్యదేవుని సన్నిధిలో సినీ రచయిత జేకే భారవి

అన్నవరం: రామదాసు, అన్నమయ్య, మంజునాథ, ఆదిశంకరాచార్య సినిమాల రూపకర్త, ప్రముఖ సినీ రచయిత జేకే భారవి మంగళవారం మధ్యాహ్నం సత్యదేవుని ఆలయంలో స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

న్యూట్రీగార్డెన్‌పై మహిళలకు అవగాహన

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో మహిళలకు న్యూట్రీగార్డెన్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూట్రీగార్డెన్, సూర్యమండలం మోడల్‌పై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో 9 నుంచి 12 రకాల ఆకుకూరలు, కాయగూరలు పెంచుకోవడం ద్వారా నిరంతర ఆదాయం, ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం



మహిళకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ గరిసింగు శివలక్ష్మితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద ప్రజలకు ఇంటి ముంగిటే కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. నిష్ణాతులైన వైద్యులతో సేవలందించి, ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, దార్ల సూర్యచంద్ర, ఉల్లూరి శ్రీను, తోలెం విజయరాజు, ఏఏబీ చైర్మన్ సుర్ల రాజు, వైద్యాధికారి డాక్టర్ యామిని కావ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు యువతకు ఆదర్శం

మహాత్ముని వర్ధంతి సందర్భంగా ప్రముఖుల నివాళులు



ఏలేశ్వరంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కోటనందూరులో గాంధీ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు



గోకవరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వివిధ చోట్ల పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, ఎంపీటీసీ యిజనగిరి శివప్రసాద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జాతిపితగా గాంధీజీని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తరాలు మారినా గాంధీజీ స్థానం చిరస్థాయిగా ఉంటుందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. సచివాలయాల ద్వారా గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విగ్రహ దాత కోరాడ అప్పలస్వామి, శిల్పి ఏబీవీ ప్రసాద్, పార్టీ నాయకులు పతివాడ జగదీష్, చందక కిరణ్, సామంతుల శ్రీనివాసరావు, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గాంధీజీ

కోటనందూరు: మహాత్మా గాంధీ సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శప్రాయమని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో గాంధీ వర్ధంతి జరిగింది. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ

తుని: వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక వీరవరపుపేటలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ అహింసా మార్గం అందరికీ ఆదర్శప్రాయమని సంస్థ జిల్లా గవర్నర్ చదరం శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, క్లబ్ ఉపాధ్యక్షుడు కండవల్లి జోసెఫ్, ప్రతినిధులు పర్వత బాబురావు, నెల్లిపూడి నాగేశ్వరరావు, చోడిశెట్టి బాబురావు, ఐఈఆర్పీలు రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులకు దుప్పట్లు, పండ్ల పంపిణీ

కిర్లంపూడి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు బి.రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పక్షోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ గాంధీ వర్ధంతి సందర్భంగా వచ్చేనెల 13 వరకు గ్రామాల్లో పక్షోత్సవాలు నిర్వహిస్తారన్నారు.

సచివాలయ వ్యవస్థతో..

గోకవరం: మహాత్మాగాంధీ వర్ధంతిని గోకవరంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ దాసరి చినబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. వరసాల ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలతో సాకారమైందన్నారు. పార్టీ నాయకులు సుంకర వీరబాబు, గుబ్బలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నరాలశెట్టి నర్శయ్య, సుంకర వెంకటరమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మహాత్మాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక గాంధీ జంక్షన్‌లోని గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి, నివాళులర్పించారు.